కథ

# సాగనేర్వని తీగ

డా॥ యన్. రామచంద్ర

రంగన్న ఏకైక పుత్రిక సుందరి. తల్లి పోయాక అన్నీ తానై గుండెల్లో దాచుకొని పెంచుకున్నాడు. తను ఎంతో ప్రేమగా, ప్రాణంగా చూచుకున్న భార్య ముమ్మూర్తులా సుందరి రూపంలో పునర్జన్మ పొందిందని ఆమె అకాల మృత్యువును రంగన్న త్వరగానే మరచిపోయాడు.

రంగన్న వెన్న సేకరించి నెయ్యిగా మార్చి అమ్ముతాడు. అతని నెయ్యికి మంచి గిరాకీ. కల్తీలేని నిఖార్సయిన సరుకు. ప్రతి శనివారం పల్లెలు తిరిగి వెన్న సేకరించుకుంటాడు. తూకం, ధర – అన్నింటా ఆడంగులు రంగన్నను మెచ్చుకుంటారు. సూర్యుడైనా కొంచెం అటు నిటుగా ఆకాశంపైకి వస్తాడేమోకాని రంగన్న టైం తప్పడు. కాల్నడకే అతని వాహనం. పెద్దగా లాభం ఆశించడు: సుందరి చదువు, ఇంటి ఖర్చు జరిగితే చాలనే అల్పసంతోషి. అతని ఆస్తి ఒక డబ్బా, ఇనప సిబ్బీల త్రాసు, తూకపురాళ్ళూ, ఒక చిన్న పెంకుటిల్లూ.

ఉన్నట్టుండి ఒకనాడు తీవ్రజ్వరంలో పడి శరీరమంతా పెద్ద పెద్ద బొబ్బలు, డాక్టర్లకే అంతుబట్టని రోగం, కంచానికి మంచమేగతి.

బాలసుందరం రంగన్నను ఎత్తడం, దించడం, తొయ్యడం, మొయ్యడంకాన్నుంచి కొడుకు కంటే మిన్నగా సహకరించాడు. తండ్రి శరీరాన్ని చూసి సుందరి బెంబేలెత్తిపోయింది. సుందరికి బాల సుందరం ఒక చిన్న వైద్యం నేర్పుతూ ఆ యింటికి దగ్గరయ్యాడు. అది కూడా రంగన్న పురమాయింపే.

అదే వీధిలో రంగన్న యింటికి ఎదురు వరసలో బాల సుందరం ఇల్లు. తల్లి నుండి వైద్యం వారసత్వంగా నేర్చుకున్నాడు వారానికి రెండు రోజులు ఆది, గురువారాల్లో పచ్చ కామెర్లకు, తెల్ల కామెర్లకు మందివ్వటం. తల్లి కాలంలో పొట్లం రెండు మూడుగా ఉన్నది బాల సుందరం పది రూపాయలు చేశాడు. సుందరి పొట్లాలు కడుతుంది. బాలు అమ్ముకొని సొమ్ముచేసుకు వస్తాడు. ఈ సొమ్ముని రంగన్న వైద్యానికి ఉపయోగపెట్టాడు బాలు. అంతుబట్టని రోగంతో కన్ను మూసే చివరి రోజుల్లో బాలు తప్ప రంగన్ననుంచి వచ్చే దుర్వాసన్ని ఇరుగు పొరుగు వాళ్ళు భరించలేకపోయారు. ఉత్తర క్రియలు అతడే నిర్వహించాడు.

సుందరి ఒంటరిగా ఆ యింట్లో ఉండలేక తండ్రి వికార భయంకర స్వరూపం పదేపదే గుర్తుకు వచ్చి భయపడింది. జ్ఞాపకాల నీడలు ఒక పట్టాన వదలవు. పోయిన మనిషి తిరిగిరాడని తెలిసీ భయపడట మెందుకు? తరతరాల నుంచి వస్తున్న ఒక నీలి విశ్వాసం. వీటి సత్యాసత్యాల్ని విశ్లేషించు కోరు. జీవి ఆ పరిసరాల్లోనే తిరుగుతూంటుందని భయం.

"బాలూ! ఒంటరితనం, నాన్న జ్ఞాపకాలూ – ఈ ఇంట్లో ఉండలేకపోతున్నాను. కొన్నాళ్ళు రాయచోటిలో ఉండే మా మేనత్త వద్ద గడపాలని ఉంది. నన్ను తీసుకు పోతావా?" అంది సుందరి.

"మా ఇంట్లో ఉండవచ్చు గదా! నాకు మాత్రం ఎవరున్నారు?"

"ఇప్పటికే కొన్ని వినరాని మాటలు విన్నాను. నీ సహాయం నన్ను కట్టివేసినా, ఇంకా నీకు భారం కాదలచుకోలేదు. ఎలా బతకాలో ఏమీ తోచటంలేదు" డగ్గుత్తికతో కంట్లో నీళ్లు మెదిలాయి.

బాలు సుందరిని రాయచోటి చేర్చి వచ్చాడు. ఆమె లేమితో తాను ఏదో పోగొట్టు కొన్నవాడిలా చీకాకు పడ్డాడు. తన చేతిలో ఉన్న చిన్న వైద్యం ఒక విధంగా కాలక్షేపం, జీవనాధారం గూడా.

ఆవాళ గురువారం కోయిలకుంట్లకు వెళ్లి మందు పొట్లాల అమ్మకం ముగించుకురాగా ఇంట్లో ఉత్తరం.

"బాలూ! ఒకసారి వచ్చిపో. నా జీవితానికి సంబంధించిన కొన్ని నిర్ణయాలు నీ సమక్షంలో

తీసుకోవలసి ఉంది. శూన్యంలో నీవే నాకు ఆశాదీపం. ఇక్కడ ఎక్కువ కాలం ఉండలేను"

సుందరి పట్ల బాలు ఆకర్షితుడౌతున్నాడని బంధువుల గుసగుసలు. "కులం ఒకటి కాదు. దిక్కు దివానంలేని పిల్ల. తమ కులం పిల్లను కట్టబెడితే ఆప్యాయతలు, రాకపోకలూ ఉంటాయి. వీడి బ్రతుకు దెరువుకు ఏదో ఒక ఆధారముంది. సొంత గూడూ ఉండే" అని పెళ్లి మాటలు చర్చించుకున్నారు అయిన పోయిన వాళ్ళు.

బాలును చూడగానే సుందరి దుఃఖం కట్టలు తెంచుకుంది. అడవి నుంచి వచ్చిన ఆవును చూచి లేగదూడలా సేదదీరినట్లయింది. ఆ యింట్లో సుందరికి సరైన ఆదరణలేదని బీడీలు చుట్టి బతికే అత్తకు మరే ఆధారంలేదని బాలుకు అర్థమైంది. ఆడపిల్ల బతుకు మగపిల్లవాడులా సులభంగా కడతేరిపోదు. బయటికి చెప్పుకోలేని ఎన్నో అవసరాలు ఇబ్బందులు.

"నాయనా బాలూ! మా బంధువు ఒక అమ్మాయి సౌదీలో ఉంది. సుందరిని ఎలాగైనా పంపమని తొందరజేస్తోంది. పాస్‌పోర్ట్ వ్యవహారం చూస్తే వీసా తానే పంపుతుందట.

ముప్పయినలభై వేలయినా పట్టవచ్చు. ఈ ఊళ్లో వలీ అనే సాయిబు అక్కడకు పంపే ఏజెంటు. ఈడుంటే ఈ యమ్మి ఇట్లనే కుములు తుంటాది" విషయం బైట పెట్టింది అత్త.

"మన ఊళ్లో వున్న మా యింటిని అమ్ము. చాలకపోతే కొంత నువ్వే సర్దు. జమ పడగానే పంపుతాను. ఎన్నాళ్ళని అత్త నన్ను పోషిస్తుంది? నీకు కూడా నేను భారం కాదలచుకోలేదు. అంతో ఇంతో చదువుకున్నాను. గౌరవప్రదంగా జీవితం కొనసాగించుకోవాలని తలంపు. ఈ జ్ఞాపకాల నుండి బయటపడాలి"

సమస్య సుందరిది. ఉచ్చులు బాలు చుట్టూ బిగుసుకోవటం. దారి తోడును జీవిత సహచరిని చేసుకోవచ్చు. కాని కులం, దానికి ఒప్పుకోని కొందరు పెద్దలు. ముఖపరిచయమైనా లేని ఒక పిల్లతో పెళ్లి, దానిచుట్టూ అల్లుకొనే బంధాలూ, సుందరి కోరిన సహకారం – మనిషి ఒంటరిగా లోకంలో బతకలేడనే కాబోలు. వీటన్నిటికీ దూరంగా జరిగి ముముక్షువులు గుహల్లో తలదాచుకోవటం! వైరాగ్యమా? సమస్యలనుండి పలాయనమా? అశక్తతా? ఒంటరిగా ఉండి, తపస్సిద్ధి పొంది మళ్ళీ ప్రజల్లోకి వచ్చి బోధలు! ఆశ్రమాలు! పీఠాలు! వీటికి అర్థం ఏమిటి? అంతం ఎప్పుడు? సమస్యను ఒక చోట నుండి మరొక చోటికి జరపడమా?

ఇల్లు అమ్మి, మరి కొంత జతచేసి, సుందరి ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు ముగించి విమాన మెక్కించేవరకూ అన్నీ తానే అయ్యాడు. బరువు తీరింది. అత్తకు బరువు కాకూడదని సుందరి, బరువంతా మోసిన బాలు – ఎవరి స్థానాలు వారివి, ఎవరి అంచనాలు వాళ్ళవి. ఇవి బాధ్యతలా? సహకారమా? మనిషికి మనిషి తోడ్పడాలనే మానవతా ధర్మమా? రాయచోటికి పోకపోతే సుందరికిగాని, ఆమె అత్తకుగాని ఈ ఆలోచనలు వచ్చివుండవు. బాలు తోడ్పాటు లేకపోతే సుందరి కోరికతీరదు. ఈ కార్య కారణాలకు ఎక్కడ మొదలు? ఎక్కడ అంతం? అందరూ మానవులవడమే ఒక కొలమానమా?

బాలుకు పెళ్ళయింది. ఏవేవి ఆలోచనలతో, పెళ్లి అనే ఒక తంతుతో కొత్త చోటికి, కొత్త మనుషుల మధ్యకు, కొత్త వ్యక్తితో కలిసి జీవించేందుకు సిద్ధపడతారో? భర్త అనేవాడి ధీరత్వం కింద బతకటం, తల్లిదండ్రులనుంచి విడివడి మరొకడి ఆసరాతో జీవితోద్ధరణకో, వంశోద్ధరణకో, ఏదైనా స్వార్థమే. తన భర్త తనవాడు, తన కనుసన్నలలో, తనకై బదికేవాడు, అలిగితే, కోపగిస్తే, తిడితే పడేవాడు, పెడితే తినేవాడు. తనకు భర్త, తనకే భర్త, శరీరమే కాదు మనస్సుకూడా ఇతరులకు పంచియివ్వనివాడు, తనను గురించి తప్ప మరే ఆలోచన లేనివాడు, అడిగింది లేదనక అప్పైనా, ఒప్పైనా కాకపోయినా తెచ్చి ముందు కుమ్మరించేవాడు భర్త. ఒకరు, ఇద్దరు, ముగ్గురు వెంట వెంటనే పిల్లలు. ఇంకెక్కడికి పోగలరు? సంసారం ఒక ఊబి, పడితే బైటపడే అవకాశమేలేనిది.

సుందరి డబ్బు పంపింది, పంపుతూ ఉంది, ఇంకా పంపుతుంది. తన కంటూ ఏ ఆశా మిగుల్చుకోనిది. బాలు పెళ్ళిని హర్షించి కానుకలు పంపింది. కోమలిని కంట్లో పెట్టుకోమన్నది. భూమి కొనమంది. ఆస్తిని పెంచుకోమంది.

'ఈ ఆస్తినంతా ఎవరి పేర రాయాలి? మనిషి స్వార్థం ఎంతకైనా తెగిస్తుంది. నీకిచ్చే గుణమున్నా నాకు తీసుకొనే అర్హత లేదు లోకుల కళ్ళు చెడ్డవి, హృదయం అంతకంటే కలుషితం' ఇది బాలు ఆలోచన.

'బాలూ! నాకెవరున్నారు? నాకేంకావాలి? నీకు భార్య, ముగ్గురు బిడ్డలు. మోయలేనంత భారం. నీకూ, నీ పిల్లలకూ, నీ భార్యకూ సమానమైన హక్కుగా ఆస్తి, భూములు, గృహాలు, వాటి రాబడి – అంతానీకే – నీకే. నీ యిష్టం. అక్కడికి వస్తానో, ఇక్కడే రాలిపోతానో నా గురించి ఆలోచించకు'.


ఉత్తరం చదివిన కోమలి మెదడు మొద్దు బారిపోయింది. హృదయం చెడు నాశంకించింది.

'ఈయనకు ఆమెకి ఏమిటి సంబంధం? ఎందుకింత ఔదార్యం? అక్కడేం జేస్తోందో? ఎలా సంపాదిస్తోందో? దొంగతనమా? శరీరాన్ని అమ్ము కుంటూ ఇక్కడ మరో శరీరాన్ని కొనడానికి?'

అనుమానముంటూ ప్రవేశించకూడదు, ఇక దానికి చిలువలు, పలవలు, రంధ్రాన్వేషణలు! తాము సుఖంగా ఉండరు, ఎవరినీ ఇంక సుఖంగా ఉండనివ్వరు – ఎదకు చెద పట్టినట్లు.

'ఇన్నాళ్ళూ తాను తిన్నది, బిడ్డలకు పెట్టినది – అంతా విషపు కూడన్నమాట! ఎవరు కోరారు? ఆనోటా ఈనోటా విన్నమాటల్ని ఈనాటి వరకూ పట్టించుకోకపోవటం నా తెలివి తక్కువే. ఆస్తులకు సంరక్షకుడు కావటం వేరు, హక్కుదారుడు కావటం వేరు. ఆమె తిరిగి వచ్చిననాడు ఈ ఆస్తులన్నిటినీ అప్పచెప్పవద్దూ? పొలాలూ, ఇళ్ళు, ఆస్తులు అన్నీ పదుపు కూడు. ఈయన నన్ను నమ్మించేందుకు ఇంతగా దాపరి కమా? నాకు తెలీ కుండా ఏం జరుగుతోంది; లేమిలో పుట్టిన దాన్ని ఏ కోరికాలేని దాన్ని'

బాలు వచ్చేప్పటికి వాతావరణమంతా కసిగా, అనుమానంగా, వాడిగా, వేడిగా కనిపించింది. బయటి నుంచి విసుగుతో నలతతో వచ్చిన వ్యక్తికి చల్లని నీళ్ళో, ఆప్యాయతతో



గుంటూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 'నేలగంధం' పుస్తకాన్ని ఆవిష్కరించిన శ్రీ పాపినేని శివశంకర్, ఇంకా చిత్రంలో కవి శ్రీ శివారెడ్డి, జిరసం అధ్యక్షులు శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య, పుస్తక రచయిత, కవి శ్రీ ధర్భశయనం శ్రీనివాసాచార్య

కూడిన పలకరింపో, ఒక కృతజ్ఞతా సూచకమైన ఓదార్పో లేనిచోట జీవితం నరకం.

'ముప్పయి ఎకరాల భూమి, పుష్కలమైన నీళ్ళు, పది హార్స్ పవరుగల రెండు మోటార్లు, రెండు కుటుంబాల యానాదులు, కోరిన పంటలు - అన్నీ అమిరాయి. సుందరి ఏం జేస్తుందో, ఎలా ఈ ఆదాయాన్ని పొందుతుందో, నన్నూ, నా కుటుంబాన్ని ఇలా ఒక దేవతలా ఆదుకోవటం కేవలం ఒక ఘటన. నిన్న మొన్నటి వరకూ ఏ ఆదర్శంలేక జీవనభృతికి శ్రమిస్తూ ఉన్న నాకు ఒక స్థిరత్వం, సుఖమయమైన జీవితం కల్పించిన సుందరి ఏ ముళ్ళ మీద నడుస్తున్నదో, ఏ విషం మింగి అమృతం కురిపి స్తుందో? ఆమె ఆస్తికి నేనొక కాపలాదారును' ఇది బాలు అంతరాత్మ.

"ఆమె యెవరు? ఆమెకు నీకు ఏమి సంబంధం? ఈ ఇంటా ఆ ఇంటా చెవులు కొరుక్కునే దుర్వార్తలకు నీ సమాధానమేది? నాకూ, నా పిల్లలకూ ఎందుకని పడుపుకూడు తినిపిస్తున్నావు? మనకు కలిగింది కలో గంజో చాలు, ఈ వైభవాలు, ఆర్భాటాలు నాకువద్దు. దీనికి నీవు స్పందించలేకపోతే నా మార్గం నేను వెదుక్కుంటాను" కోమలి బాలును నిలదీసింది.

వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఆలోచనల్లో ఎంత అంతరం? చెడు తప్ప సమాజంలో, ప్రపంచంలో మంచికి చోటులేదా? ప్రవక్తలు, ధర్మగ్రంథాలు, మనుషులు చేసే పూజలు, వ్రతాలు, యజ్ఞాలు చెడును వెదజల్లడానికా, మంచిని విస్తరించటానికా? తాను ఊహించినట్లుగా, తాను కోరుకున్నట్లుగా లోకరీతి ఉండదు.

'సుందరి ఎవరని చెప్పాలి? నాకేమవుతుంది? ఏమైనా అయితేనే మనిషి నుండి మనిషికి సహకారమా? సుందరి అనే ఒక అందమైన యువతి కాక ఆ స్థానంలో మరొక పురుషుడే ఉండి వుంటే నేను సహకరించి ఉండనా? అలా సహకరించుకోవడానికి సంఘం, నీతి సూత్రాలు అంగీకరించవా? ప్రాథమికంగా అందరం మనుష్యులం, బుద్ధి జీవులమనే సూత్రాల్ని మరచి సంఘంగాని, మరొకటిగాని ఉంటుందా? గంగిరెద్దు పాలివ్వదు, వ్యవసాయం చెయ్యదు. పెయ్యల్ని కనదు - అని వదులుతున్నామా? దాన్నుండి మనిషికి ఏ సహకారం లేకపోయినా, కుప్పెలతో, తలతాళ్ళతో, కాలిగజ్జెలతో, బొడ్డువార్లతో రంగు రంగుల పాత దుస్తులతో అలకరించి, తవుడు, చిట్టు, గడ్డి, కుడితి, నీళ్ళు ఇచ్చి పోషించటం లేదు. మరి మనిషికి మనిషికి సహకారం అందించటం దోషమా? పాపమా?'

"సుందరి ఒక మనిషి, అనాథ, బదికేందుకు ఏ ఆధారం లేని ఒక జీవి. కాని ఆమె బతకాలి. బదికేందుకు ఎవరో ఒకరు ఏదో ఒక మార్గం చూపాలి. నేను చేసింది అదే కదా! నీ కంటే ముందు ఆమె నాకు పరిచయం. మావూరు, మాపేట, ఒక అగమ్య స్థితిలో వున్నపుడు ఆమెకు సాయపడ్డాను. పెళ్ళి చేసుకొనే వరకూ నువ్వెవరో నాకు తెలీదు. 'ఈమె నీ భార్య నీకు నచ్చినా, నచ్చకపోయినా నీ వెంట వుంటుంది. నీవు చెప్పినట్లు నడుచుకుంటుంది' అని నా చేతికందించారు, నీకు ఏ లోపం చెయ్యలేదు. నీకోరికకు అనుగుణంగా నడుచుకుంటున్నా. నీలో ఎక్కడో దాగిన అనుమాన పిశాచం, నీలాంటి మరికొందరు దాన్ని పెంచి, పోషించి నీపై ప్రయోగించారు. అది నిన్ను నిమ్మలంగా ఉండనివ్వలేదు. నిన్ను బలిగొన్న అది నాపై బుసలు కొడుతోంది. కాని నన్నేం చెయ్యలేదు. నేను సొంతంగా ఆలోచించే వ్యక్తిత్వమున్న వాణ్ణి. నీలాంటి వాళ్ళపై జాలి, సానుభూతి నాకుంది. నిన్ను నీవు తెలిసికొని, నీ జీవితాన్ని దిద్దుకోవడానికి యత్నించే వరకు నీవు నన్నెలా భావించినా, ఎలా అర్థం చేసుకున్నా నేను చలించను. నీవెన్ని గిరికీలు కొట్టినా సుందరిపట్ల నాకున్న దృష్టిమారదు. నీ జీవితం నీయిష్టం, నీ సొంతం. దిద్దుకుంటావో, ముంచుకుంటావో? నేను నీకందిస్తున్నది పడుపుకూడు కాదు, నా శ్రమ ఫలితం, ఆమె ఆస్తికి నేను వారసుణ్ణికాను. సంరక్షకుణ్ణి, కావలివాణ్ణి, కూలివాణ్ణి. ఆ కూలితో నీకు కూడు అందిస్తున్నాను"

"నీవు కూలి వాడివో, సంసారాన్ని కూలదోసేవాడివో, కొల్లగొట్టేవాడివో? నీ నిర్ణయం మారకపోతే నా మార్గం నేను చూసుకోవల్సి వస్తుంది. పెళ్లికి ముందు ఇట్లాంటి ఒప్పందాలేవీలేవు. నా వాళ్ళతో ఈ విషయం సంప్రదిస్తాను. ఒక్క ఒరలో రెండు కత్తులిమడవు. ఒక్క మనసులో ఇద్దరుండే వీలులేదు"

"నీ నిర్ణయానికి నేనడ్డురాను, నా నిర్ణయం మార్చుకోను. మంచిని పంచియివ్వటం తప్పయితే, మనిషి మనిషిగా గాక మరోవిధంగా మసలు కోవటం నాకు కుదరదు. అనాలోచితమైన మనచర్యల వల్లే ఇప్పటికీ సభ్య సమాజంలో మనకు విలువ లేకుండా పోయింది. చోరత్వం, జారత్వం మీ కుటుంబంలో మీకు తెచ్చిన తలవంపులు నాకు తెలిసికూడా నీపై ఒక్క అభియోగం మోపలేదు. తరతరాల నుంచి తలకంటుకున్న మైల, మకిలి ఒక రోజుతో వదిలేది కాదు"

పొలం వద్దనే తనకు కొంత మనశ్శాంతి. పంట పండించటమే కాదు, దాన్ని సరియైన ధరకు అమ్మటం కూడా ఒక నేర్పే.

తానుంటున్న ఊరికి - పొలానికి ముప్పయి కిలోమీటర్లు. ఆ పొలం ఆలనా పాలనా చూసుకోలేని ఒక డాక్టరుది. సుందరి అంగీకారం మేరకు కొన్నాడు, ఆమె పేరనే రిజిష్టరు చేయించాడు.

ఇంటి తాళం బాలును వెక్కిరించింది.

కోమలి మనస్తత్వం బాలు ఎరుగును. ఆమెకు సుఖంగా బతకటం తెలీదు. సమస్యల్ని కొని తెచ్చుకుని కుమిలిపోవటం, పిల్లల్ని కొట్టి వేధించటం. తనకు, పిల్లలకు స్వేచ్ఛ ఉంటుందని దూరంగా రెసిడెన్షియల్లో చేర్చినా, కొంత కాలమైనా భరించలేక వాళ్ళను తిరిగి తెచ్చుకోవటం - ఇరుగు పొరుగు వాళ్ళ సానుభూతి కాదుకదా, ఆమె నీడను కూడా దరికిరానీయక పోవడం ఒక విధమైన మానసిక రోగమే. స్థలం మార్పు అని కొంత కాలం పొలంవద్ద కాపురం పెట్టి బాలు నరకాన్ని అనుభవించాడు.

'ఈ స్థితికి నా బాధ్యత యెంత? ఒక పిచ్చిదాన్ని బలవంతంగా నా మెడకు చుట్టారు, అయిన వాళ్ళు. నేకోరుకున్న, నేనూహించుకున్న సుందర స్వప్నమా ఇది. మనిషి విధికి బానిస అంటారు - ఇదేనేమో! ఏనాడు ఘర్షణ పడినా ఏదో ఒక అఘాయిత్యానికి దిగి నలుగురిలో ఇప్పటికే నన్ను చులకన చేసింది. ఆమె యింటి వాకిలి తొక్కి ఎన్ని అవమానాలు భరించవలసి ఉంటుందో? ఎలాంటి దుర్వార్త



10-10-09న విశాఖలో డా॥ బండి సత్యనారాయణ 'పునరపి జననం' కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, డా॥ హరిబాబు, డా॥ ద్వా.నా. శాస్త్రి, శ్రీ గుడిపాటి, డా॥ ఆర్. రామం తదితరులు

వినాలో? ఆమెను తప్పు పట్టలేను. స్త్రీ సహజమైన బలహీనతలకు ఆమె అతీతమేమీ కాదు. ఆమె స్థానం నుంచి ఆలోచిస్తే నాలో దోషం కనపడవచ్చు. కాని మనిషి విచక్షణా జ్ఞానం ఏమైంది? తల్లిదండ్రులు, ఇతర బంధువులు సానుభూతికాని, సమర్ధనగాని, సమస్యకు పరిష్కారం వెదకాలిగాని, ఎగదోయడం ఏం నీతి?' బాలు మనస్సు కలతపడింది.

మొగుడు పెళ్లాన్ని తరమటమా - పెళ్ళాం మొగుణ్ణి తరమటమా? భార్యలు గతించిన కొద్దికాలానికే ఒంటరి జీవితం గడపలేక చనిపోయిన భర్తలు ఎలాంటివాళ్ళు? వాళ్ళ మధ్య ఉన్నది కేవలం భార్యా భర్తల సంబంధం కాక అంతకంటే ఉత్కృష్టమైన గొప్ప తాత్త్విక దృష్టి ఉండి ఉండాలి. భర్తలు పోయినా, వికార రూపం ఒంటి మీద వేసుకొని సంసారాన్ని ఈదుతూ ఎంతమంది విధవలు బ్రతకటం లేదు? మనుషుల మధ్య బంధనాలాకుగాని, ఎడబాటుకుగాని మనస్సేకారణమేమో? ఆ మనస్సును నియంత్రించేది ఏది? కర్మ! విధి! అదృష్టం! దురదృష్టం! పాపం! పుణ్యం! రెండు విభిన్న కుటుంబాలనుండి వచ్చిన స్త్రీ పురుషుల మధ్య గాఢమైన అనుబంధాన్ని పెంచేది ఏది? ప్రేమా! అర్పణమా! త్యాగమా!అనుభవమా! ధనమా! సంతానమా! ఆశా! కర్మఫలానుభవమా! ఏ ఒక్కరు కనుమరుగైనా 'మరపు' అనేది అన్ని బంధాల్ని ఎలా విడదీయగల్గుతోంది? మనస్సు - మరపు అనేవి శత్రువులా! మిత్రులా! ఏడుపు - నవ్వు క్షణంలో ఏడుపు నవ్వుగా, నవ్వు ఏడుపుగా ఎలా మారగల్గుతోంది? సృష్టి ఆది - అంతమూ రెండు చూడగలిగిన వాళ్ళు ఈ ప్రశ్నలకు సమాధానమీయగలరు కాబోలు! బ్రతుకు క్షణికం, క్షిణికం, నీటి బుడగ అంటూ తెలిసీ ఏదో చెయ్యాలనీ, సంపాదించాలనీ ఇంకా ఇంకా అనుభవానికి రానివి సాధించాలని నిరంతరం శ్రమించటం తన మాటకు- ఆలోచనకు - విధికి - జరిగే దానికి పొంతన ఉందా?

బాలు అత్తగారి ఊరు చేరుకున్నాడు. అంతా నిశ్శబ్దం. పిల్లలు వచ్చి కాళ్ళకు చుట్టుకొని, సంచి వెదికి తినుబండారాలకు ఆరాటపడలేదు. కోమలి, తల్లిదండ్రులు, బావమరదులు - ఎవ్వరు అతని రాకకు స్పందించలేదు. పిల్లలు దూరం జరిగారు. పలకరింపులేదు. ఆదరణలేదు. మొత్తం కుటుంబ సభ్యులంతా కోమలి అనుభవిస్తున్న మానసిక వ్యాధిగ్రస్తులా? ఎంతటి జటిల సమస్యకైనా ఏదో ఒక పరిష్కారముంటుంది. దానికి మూలాన్ని వెదకాలి. తప్పొప్పులకు తావులేదు.

"పిల్లల్ని కోమలిని తీసుకుపోతాను" బాలు.

"ఎందుకు? బావిలో తోసేందుకా?" మామ.

"ఆమె మీకు ఏమేమి చెప్పిందో, మీమనస్సు ఎలా విరిచిందో నాకు తెలీదు. నా పిల్లల్ని, భార్యను పోషించటం నాధర్మం. అందుకు కావలసిన ఏర్పాట్లు మీరు చూడండి"

"అదెవత్తో ఉందటగా, దాంతోనే కులుకు. ఇంత వయస్సు వచ్చాక నీకు ఈ ఆలోచన ఎలా వచ్చింది'. నీ సుఖాలకు వీళ్ళంతా అడ్డంకి. నీకున్నదేదో మా ముఖానకొట్టు మళ్ళీ నీ ముఖం చూడం"

"నేను చెప్పుకోవలసింది ఏం లేదా?"

"నీవు ఒక నీతికి కట్టుబడివుంటే ఇంత దూరం రాదు"

విలువలు మరచిన పెద్దతనంతో పోట్లాట బాలుకు నచ్చలేదు.

తల్లిదండ్రులతో, అన్నదమ్ములతో, అసలు ప్రపంచంతో రాజీ కుదరక కోమలి జీవితాన్ని అంతమొందించుకుంది. రక్షణలేని తీగను ఏదో ఒక పశువు మేసిపోతుంది. చెడు ఆకర్షించినంత త్వరగా మంచి ఆకర్షించి బతకలేదు.

చీకిపట్టి రూపాలు మారిపోయి మోడుల్లా వున్న పిల్లల్ని వెంట బెట్టుకొని, ఏ సమాధానం తనవద్ద లేదని ముఖంలో వ్యక్తీకరిస్తూ బాలు వద్ద దిగవిడచి వెళ్ళిపోయాడు మామ.

పదమూడేళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో అనుభవాల్ని మూటగట్టుకొని సుందరి స్వస్థలానికి బయలుదేరింది - సూర్యుడు అస్తమించగానే నిండు రూపంతో చంద్రుడు ఆకాశంలో ఉదయించ నున్నట్టు- వెలుగులునింపేందుకు.

సాహితీ వార్త

## కీర్తిశేషులైన కళాకోవిదులపై రచనలకు ఆహ్వానం

'కళాదీపిక' (మాసపత్రిక) ఏడో వసంతంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా కీర్తిశేషులైన కళాకోవిదుల కళాజీవిత విశేషాలపై రచనలను ఆహ్వానిస్తున్నట్లు ఎడిటర్ వి.ఎస్. రాఘవాచారి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తిగలవారి నుండి సంగీత, చిత్రలేఖన, శిల్ప, నాట్య, హరికథ, బుర్రకథ తదితర కళారూపాలలో విశేష ప్రతిభ కనబరచి, ఆంధ్రకళామతల్లికి కంఠాభరణాలుగా వాసికెక్కిన కళాకారులపై రచనలను స్వాగతిస్తున్నాం. మాకు అందిన వాటిలో 20 చక్కటి రచనలను ఎంపిక చేసుకొని, ఆయా రచయితలకు రూ.200/- చొప్పున నగదును అందజేస్తాము.

### నియమ నిబంధనలు

- తమ రచనలను ఎ4 సైజులో 16 పాయింట్‌లో డి.టి.పి. చేసి 3 పేజీలకు మించకుండా పంపాలి. చేతివ్రాతతో పంపిన రచనలు పరిశీలించబడవు.
- ఒకరు ఒక కళాకారునిమీదే రచనను పంపాలన్న నియమం లేదు. రెండు లేక అంతకుమించిన సంఖ్యలో కూడా కళాకారులమీద రచనలు పంపవచ్చు.
- రచన తమ సొంతమే తప్ప, దేనికీ అనువాదం / అనుసరణ / కాపీకాదని / అముద్రితమని హామీ పత్రంతో, తమ పాస్‌పోర్టు సైజు ఫోటోను తప్పనిసరిగా జతపరచి పంపాలి.
- రచయిత / రచయిత్రి పేరు, పూర్తి చిరునామా (పిన్‌కోడ్, ఫోన్ నెంబర్‌తో సహా) హామీ పత్రంలోనే ఉండాలి. రచన డి.టి.పి. చేసిన ఏ పేజీలోనూ వుండరాదు.
- ఎంపిక చేసుకొన్న 20 రచనలు 2010 మార్చిలో వెలువడుతున్న 'కళాదీపిక' (మాసపత్రిక) 75వ విశేష సంచికలో ప్రచురించబడతాయి.
- ఎంపికకాని రచనలు కూడా ప్రచురణార్హతను బట్టి 'కళాదీపిక' (మాసపత్రిక) 75వ విశేష సంచికలో చోటు చేసుకొంటాయి.
- రచనలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ 15 డిశంబరు 2009
- రచనలను పంపాల్సిన చిరునామా : 'కళాదీపిక' (మాసపత్రిక), 19-9-27/ఎ2/1, లక్ష్మీపురం, తిరుపతి-517501, సెల్ : 9908837451
- సర్వహక్కులు 'కళాదీపిక' (మాసపత్రిక)కు చెందియున్నవి.